గంజాయి రహితం సాధ్యమేనా?

● జిల్లా నుంచి యథేచ్ఛగా తరలింపు
● రైల్వేస్టేషన్లనే కేంద్రంగా చేసుకుంటున్న ముఠా
● భారీగా పట్టుబడుతున్న సరుకు
● అధికంగా పలాస డివిజన్‌లోనే



● ఈ నెల 14న ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ నుంచి బెంగళూరుకు తరలిస్తున్న 18.3 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని ఒడిశాలో కొనుగోలు చేసినట్లు ఇద్దరు నిందితులు చెప్పారు. వారు బస్సులో బరంపురం మీదుగా ఇచ్ఛాపురం బస్టాండ్ చేరుకున్నారు. ఇక్కడి బెంగళూరు వెళ్లేందుకు స్థానిక రైల్వేస్టేషన్‌కు చేరుకోగా పోలీసులు పట్టుకున్నారు.

....

● ఈ నెల 14న కంచిలి రైలు నిలయం సమీపంలో ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులకు అందిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు.

....

● ఈ నెల 15న పలాస, మందస, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లలో 20 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ గంజాయిని ఒడిశాలో కొనుగోలు చేసిన వ్యక్తులు బెంగళూరు, ముంబై, తమిళనాడు, హైదరాబాద్‌కు తరలించేందుకు పైన చెప్పిన రైల్వేస్టేషన్లకు చేరుకున్నారు. పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీ చేయడంతో గంజాయి బయటపడింది. మొత్తం ఏడుగురిని అరెస్టు చేశారు.



పలాస రైల్వేస్టేషన్‌లో పట్టుబడిన గంజాయి నిల్వలు, నిందితులు (ఫైల్)

పలాస, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఒక్క పలాస డివిజన్‌లోనే రెండు రోజుల్లో భారీగా గంజాయి పట్టుబడడం పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రధానంగా స్మగ్లర్లు రైళ్లలో గంజాయిని రవాణా చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వీరంతా ఒడిశాలో సరుకును కొనుగోలు చేసి జిల్లాలోని రైల్వే స్టేషన్లకు చేరుకుంటున్నారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. పోలీసులకు అనుమానం వచ్చి ఏ బ్యాగు తనిఖీ చేసినా అందులో గంజాయి దొరుకుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. గంజాయి రవాణాను అడ్డుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. దీంతో గంజాయి రహిత జిల్లా సాధ్యమేనా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఒడిశాలో సాగు..

ఒడిశా రాష్ట్రంలోని మోహన, ఆర్.ఉదయగిరి బ్లాక్‌ల్లో ఉన్న కొండల్లో గంజాయిని ఎక్కువగా పండిస్తున్నారు. ఈ కొండల పైకి ఆ ప్రాంతీయులు తప్ప ఇతరులు వెళ్లడానికి సాహసించరు. ఈ కారణంగానే ఏటా గంజాయి వందల హెక్టార్లల్లో పండిస్తుంటారు. సాధారణ పంటలు పండిస్తే రూ.40 నుంచి రూ.50 వేలకు మించి రాబడి రాదు. అదే గంజాయి అయితే మార్కెట్ బట్టి ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఆదాయం సమకూరుతుంది. అందుకే గంజాయి అమ్మకందారులు సాగుదారులకు బయానాలు(అడ్వాన్స్) ఇచ్చి మరీ గంజాయి పండిస్తుంటారు. ఎక్కువగా వర్షాకాలం, చలికాలంలో గంజాయి పండించి వాటిని ఆరబెట్టి చెక్కీలుగా చేస్తారు. వేసవిలో ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తుంటారు.

పలాస మీదుగా రవాణా..

పలాసకు ఆనుకొని ఒడిశా ప్రాంతం అధికంగా ఉంది. దీంతో రైలు, రోడ్డు మార్గాల ద్వారా గంజాయిని రవాణా చేయడం సులభంగా మారింది. అధికంగా పలాస ప్రాంతం మీదుగా ముంబాయి, హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు తరలుతోంది. అస్కా మీదుగా బరంపురం, పర్లాకిమిడి-గొప్పిలి మీదుగా పలాస వచ్చి అక్కడ నుంచి (మిగతా 8వ పేజీలో..)

ఎస్పీ ఆదేశాలు..

గంజాయి రహిత జిల్లాగా చేయాలని ఇప్పటికే ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అనేక ముఖ్య ప్రాంతాల్లో చెక్ గేట్లు పెట్టడంతో పాటు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. దీనివల్ల గంజాయి రవాణా కొంతవరకు తగ్గుముఖం పట్టింది. కానీ, కొన్నిరోజులుగా గంజాయి ముఠా మళ్లీ రెచ్చిపోతుంది. ప్రధానంగా పలాస డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్ల ద్వారా ఇతర ప్రాంతాలకు గంజాయిని రవాణా చేస్తున్నారు. ప్రతిరోజూ గంజాయి పట్టుబడడం ఆందోళన కలిగిస్తోంది. ఒడిశా తీరంతో పాటు గొప్పిలి, చీకటి, పర్లాకిమిడి-వసుంధర, పర్లాకిమిడి-పాతపట్నం, బురుజోల, బాతుపురం వంటి ఒడిశా-ఆంధ్రా భూభాగాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయడంతో పాటు కఠిన నిబంధనలు అమలు చేస్తేనే గంజాయి రవాణాకు అడ్డుకట్ట పడనుంది.

ఉక్కుపాదం మోపుతున్నాం

గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం. నిబంధనలు మరింత కఠినం చేస్తాం. గంజాయి తాగినా, రవాణా చేసినా చర్యలు తప్పవు. అరెస్టు చేసి జైలుకు పంపిస్తాం. గంజాయి వినియోగించిన వారిపై ప్రజలు మాకు సమాచారం అందించాలి.

- వి.వెంకట అప్పారావు, డీఎస్పీ, కాశీబుగ్గ

22కిలోల గంజాయి స్వాధీనం

● నరసన్నపేటలో 9 మంది అరెస్టు

నరసన్నపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో శనివారం రాత్రి గంజాయి విక్రయిస్తున్న, కొనుగోలుదారులపై దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఓ ఇంటిలో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. రూ.66 వేలు విలువ చేసే సుమారు 22 కేజీల గంజాయితోపాటు రెండు బైక్‌లు, 9సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం నిందితులను కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు వారు తెలిపారు.



ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించనున్న ప్రాంతం ఇదే..

ఎన్నాళ్లీ ఎదురుచూపు

● ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కేటాయింపులో జాప్యం
● పెరుగుతున్న పీడీఎఫ్‌ల సంఖ్య
● మూలపేట పోర్టు నిర్వాసితులకు తప్పని నిరీక్షణ

టెక్కలి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి అవసరమైన భూములిచ్చిన మూలపేట, విష్ణుచక్రం గ్రామస్థులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కేటాయింపులో జాప్యం నెలకొంది. నౌపడా మూడురోడ్లు కూడలి సమీపంలో కస్పా నౌపడా ప్రాంతంలో 55ఎకరాల స్థలాన్ని అప్పట్లో రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇది లోతట్టు ప్రాంతమని, వరదలు, తుఫాన్ల సమయంలో ఈ ప్రాంతం ముంపునకు గురవుతుందని, నిర్వాసితుల కాలనీకి అవస్థలు తప్పవని అప్పట్లో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఏపీ మారిటైం బోర్డు అధికారులు ఆ ప్రాంతంలో మట్టిని వేసి దానిపై కంకర వేసి రోడ్డుకు సమానంగా ఎత్తు చేశారు. అయినా నిర్వాసితులు మాత్రం ముంపు సమయంలో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు.

● ఇదిలా ఉండగా ఈ 55 ఎకరాల స్థలంలో 594 పీడీఎఫ్ (ప్రాజెక్ట్ డిస్‌ప్లేస్ ఫ్యామిలీ)లకు సరిపడా లేఅవుట్స్ సిద్ధం చేసి లాటరీ విధానం ద్వారా లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉండగా.. రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి రూ.34. 98కోట్లు నిధులు కేటాయించారు. వీటితో నిర్వాసితులకు ప్లాట్లుతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్లు, కాలువలు, తాగునీరు, పాఠశాల, దేవాలయం, సామాజిక భవనం, పార్కు తదితర సౌకర్యాలు ఏర్పాటుకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో స్థలం కేటాయించాల్సి ఉంది. గతంలో గుర్తించిన పీడీఎఫ్‌ల కన్నా అదనంగా పదుల సంఖ్యలో పీడీఎఫ్‌లు పెరుగుతుండడంతో నిర్వాసితులకు (మిగతా 8వ పేజీలో..)

మూలపేట పోర్టు డ్రెజ్జింగ్ పనుల నేపథ్యంలో వస్తున్న నీరు కారణంగా మేము ఆ వాతావరణంలో ఉండలేక పోతున్నాం. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించండి. లేదా మీరైనా ఇళ్ల నిర్మాణాలు చేసి ఇవ్వండి.

- ఇటీవల ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి విష్ణుచక్రం గ్రామస్థుల వినతి

ఆ కోళ్లకు ఏమైంది?

● మృత్యువాత పడుతున్న నాటుకోళ్లు
● ఆందోళనలో పెంపకందారులు



● రణస్థలం మండల కేంద్రానికి చెందిన యిజ్జిరోతు కోటేశ్వరరావు ఇంట్లో పెంచుకున్న కోళ్లు ఇవి. ఏమైందో ఏమో తెలియదు కానీ.. ఇటీవల ఒకేసారి మృత్యువాత చెందాయి. గతంలో కునుకు జబ్బుతో కోళ్లు చనిపోయేవి. కానీ ఇప్పుడు కారణం తెలియకుండానే ఒకేసారి కోళ్లు మృత్యువాత చెందాయని కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



● జేఆర్ పురం పరిధిలో ఓ పెంట గుమ్ముల వద్ద ఉన్న కోళ్లు ఇటీవల ఒక్కసారిగా కుప్పకూలి చనిపోయాయి. అవి పాముకాటుకు గురైనట్టు అంతా భావించారు. కానీ ఒకేసారి పదుల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కారణం తెలియక పెంపకందారులు బాధపడుతున్నారు.



● లావేరు మండలంలో అగ్రహారం గ్రామానికి చెందిన రమణకు కోళ్ల పెంపకం అంటే ఆసక్తి. తాను పెంచుకున్న నాటు కోళ్లు ఇటీవల అంతుచిక్కని వ్యాధితో మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పగలంతా మేత కోసం బయటకు వెళ్లిన కోళ్లు.. రాత్రి సమయంలో ఒక్క సారిగా మృతి చెందుతున్నాయని వాపోతున్నాడు.

రణస్థలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలో ఇటీవల బర్డ్‌ఫ్లూ సోకి చాలా కోళ్లు మృతి చెందాయి. కానీ రణస్థలం మండలంలో మాత్రం గతేడాది నవంబరు నుంచీ తరచూ వందల సంఖ్యలో నాటుకోళ్లు, పెరటి కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల పెంపకం అనేది సాధారణ ప్రక్రియ. గతంలో ప్రతి ఇంట్లో కోళ్లు పెంచేవారు. ఇప్పుడు క్రమేపీ తగ్గినా.. కొంతమంది మాత్రం ఉపాధి మార్గంగా కోళ్ల పెంపకం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వాలు సైతం పెరటికోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. నాటుకోళ్లకు డిమాండ్ ఎక్కువ. ఒక్కో కోడి కిలో రూ.400కుపైగా పలుకుతుండడంతో చాలా మంది వీటి పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. కాగా.. ఇటీవల తెలియని వ్యాధికి గురై కోళ్లు మృత్యువాతపడుతుండడంతో వాటికి ఏమైందోనని పెంపకందారులు కలవరపడుతున్నారు. సాధారణంగా కునుకు వ్యాధితో కోళ్లు మృత్యువాత పడడం సహజం. అలాగే చనిపోయి ఉంటాయని పెంపకందారులు భావించారు. కానీ ఆ ఆనవాళ్లు లేకుండా మేత కోసం తిరుగాడే క్రమంలో చనిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల వ్యర్థాలు, కాలుష్యం మూలంగా కోళ్లు అనారోగ్యానికి గురై ఉంటాయన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

● వరుసగా చనిపోతున్నాయి

ఇటీవల మేము పెంచుకున్న కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఆరోగ్యంగా ఉన్న కోళ్లు మేతకు వెళ్లి అక్కడే కన్ను మూస్తున్నాయి. అయితే పాముకాటుతో అని భావించాం. కానీ మా ప్రాంతంలో పదికిపైగా కోళ్లు ఒకేసారి మృతిచెందాయి. గతేడాది నవంబరు నుంచి ఇదే పరిస్థితి ఉంది. అధికారులు దృష్టిపెట్టాలి.

- టెకు లక్ష్మణరావు, కోళ్ల పెంపకందారుడు, రణస్థలం

● బర్డ్ ఫ్లూ లేదు

జిల్లాలో బర్డ్ ఫ్లూ అనేది లేదు. నాటుకోళ్లు చనిపోవడం అక్కడ ఉన్న పరిస్థితులే కారణం కావచ్చు. పూర్తిస్థాయి విచారణ చేపడతాం. నాటు కోళ్ల విషయంలో పెంపకందారులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. దానిపై అవగహన కల్పిస్తాం. ప్రజలు ఎటువంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

- దుర్గారావు, పశుసంవర్థక శాఖ ఏడీ, రణస్థలం

ఎండలోనే భక్తులు

● ఆదిత్యుని దర్శనానికి తప్పని ఇబ్బందులు
● 'అరసవల్లి'లో అరకొర ఏర్పాట్లు

7లో

....

కొండ కరుగుతోంది

● రాత్రి వేళల్లో అక్రమ తవ్వకాలు
● కంకరను తరలించుకుపోతున్న వైనం

8లో

పనిచేయని ఫైబర్ నెట్



గొట్టాబ్యారేజి దిగువన రోడ్డుపై తెగిపడిన ఫైబర్‌నెట్ వైరు

● నిరుపయోగంగా పరికరాలు
● గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పూర్తికాని పనులు

హిరమండలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఫైబర్‌నెట్ పరికరాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగమయ్యాయి. రెండేళ్ల కిందట అన్ని పంచాయతీలకు బీఎస్ఎన్ఎల్ ప్రాజెక్టు కింద ఫైబర్ నెట్ సేవలు అందించేందుకు పరికరాలు ఇచ్చారు. ఇంటర్‌నెట్ కనెక్షన్‌కు సంబంధించి ర్యాక్, స్విచ్‌తో కూడిన పరికరాలు ఇచ్చారు. ఒక్కో ర్యాక్ రూ.7వేల నుంచి (మిగతా 8వ పేజీలో..)



తాగునీటి కోసం రోడ్డెక్కి..

● హిరమండలంలో మహిళల ఆందోళన

8లో



వత్సవలసలో భూలోకమ్మ గుడి వద్ద భక్తుల రద్దీ



వత్సవలసలో సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు

రాజమ్మా.. కరుణించమ్మా..

● వత్సవలస జాతరకు పోటెత్తిన భక్తులు

గార, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గార మండలం వత్సవలసలో రాజమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఏటా మాఘ, పాల్గుణ మాసాల్లో ఆదివారం రాజమ్మ సంబరాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శనివారం రాత్రి వత్సవలస చేరుకున్నారు. రాత్రి అక్కడ బస చేసి.. వేకువజామునే సముద్ర స్నానాలు ఆచరించారు. అనంతరం మైలపిల్లి పేరయ్య దానుడు రాజమ్మ సన్నిధానం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే శ్రీకూర్మం క్షేత్రంలో కూర్మనాథుడ్ని కూడా భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో గార ఎస్ఐ ఆర్.జనార్దన్‌తోపాటు 240 మంది పోలీసు బందోబస్తు నిర్వహించారు. బీచ్ వద్ద మెరైన్ సీఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిర్మానుష్య ప్రదేశాల్లో నిఘా

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ కెమేరాలతో పోలీసులు పర్యవేక్షణ



నగరంలో డ్రోన్ ద్వారా చిత్రీకరించిన దృశ్యాలు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ కెమేరాలతో నిఘా పెట్టి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేసేందుకు పోలీసులు నిఘాపెడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని డచ్ బంగ్లా, కంపోస్టు కాలనీ, వాంబే కాలనీ, అరసవల్లి, దమ్మలవీధి, కిల్లిపాలెం, నాగావళి, పొన్నాడ వంతెన తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమేరాలతో పర్యవేక్షించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు.

దివ్యాంగ చిన్నారిపై కుక్కలు దాడి

- తీవ్రంగా గాయపడిన శ్యామల

పొందూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ పరిధి ఆలబోయినపేట, మంగళకాలనీ సమీపంలో కుక్కల దాడిలో అదే కాలనీకి చెందిన ఎనిమిదేళ్ల దివ్యాంగ చిన్నారి సెనగలు శ్యామల తీవ్రంగా గాయపడింది. మూగ, చెవిటితో బాధపడుతున్న శ్యామల స్నేహితులతో కలిసి కాలనీకి సమీపంలోని వివాహ విందుకు వెళ్లివస్తుండగా వెనుక నుంచి ఆరు కుక్కలు ఒక్కసారిగా వారిపై దాడికి ప్రయత్నించాయి. దీన్ని గమనించిన మిగిలిన పిల్లలు భయపడిపారిపోగా కుక్కల అరుపులు వినిపించని శ్యామల అక్కడే ఉండిపోయింది. దీంతో ఆ కుక్కలు ఒక్కసారిగా శ్యామలపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడింది. అటుగా వస్తున్న కొంత మంది కుక్కలను తరిమి చిన్నారిని కాపాడారు. గాయపడిన శ్యామలను కుటుంబసభ్యులు పొందూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కుక్కలదాడులు రోజురోజుకు పెరిగిపోతుండడంతో తమ పిల్లలను పాఠశాలకు, బయటకు పంపించడానికే పిల్లల తల్లిదండ్రులు భయపడిపోతున్నారు. పంచాయతీ అధికారులు కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



గాయపడిన చిన్నారి శ్యామల

ఎండలోనే భక్తులు

- ఆదిత్యుని దర్శనానికి తప్పని ఇబ్బందులు
- 'అరసవల్లి'లో అరకొర ఏర్పాట్లు

అరసవల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాఘమాసం, మూడో ఆదివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉచిత, రూ.100 క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ తూర్పు ద్వారం వరకు భక్తులు క్యూలైన్లలో స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. గంటల కొద్దీ భక్తులు లైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానికి క్యూ లైన్లలో వెళ్లే భక్తులకు ఎండ బాధలు తప్పలేదు. గత వారం భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ఏర్పాట్లు చేసినా అవి సరిపోకపోవడంతో భక్తులు ఎండలోనే నిల్చోవడం కనిపించింది. రథసప్తమి ఏర్పాట్ల పేరుతో ఆలయం ఎదురుగా ఉన్న భవనాలను తొలగించారు. వాటితో పాటు భక్తులకు ఎండ, వర్షం నుంచి రక్షణ కల్పించే షెడ్లను కూడా తొలగించడంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు. ఆలయం ఎదుట గల విశాల ప్రాంగణంలో తాత్కాలికంగా షెడ్లను నిర్మిస్తే ఆలయానికి వచ్చే భక్తులకు కొంత మేర సౌకర్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే వీఐపీ, వీవీఐపీ ప్రొటోకాల్ దర్శనాలకు వచ్చే భక్తులు ఆలయ ప్రధాన ద్వారం గుండా, ఆలయ అనివెట్టి మండపంలోకి ప్రవేశించి, నేరుగా స్వామివారిని దర్శించుకుంటారు. కానీ ఇక్కడ బయట ఓపెన్‌గా వదిలేయడంతో భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడి, ఆలయ సిబ్బందిపై ప్రత్యేక దర్శనం కోసం ఒత్తిడి చేస్తున్నారు. ఇక్కడ గతంలో మాదిరిగానే ఇరువైపులా బారికేడ్లను వేస్తే, దర్శనాలు సజావుగా జరుగుతాయని, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



క్యూ లైన్‌లో ఉన్న భక్తులు



ఎండలో అవస్థలుపడుతున్న భక్తులు

ఆదిత్యుని ఆదాయం రూ.11,46,410

అరసవల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాఘమాసం, మూడో ఆదివారం ఆదిత్యుని దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. గంటల కొద్దీ క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి, రావిచెట్టుకు ప్రదక్షిణలు సమర్పించి, క్షీరాన్నం వండి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.11,46,410 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.8,15,000, విరాళాల ద్వారా రూ.1,08,740, ప్రసాదాల ద్వారా రూ.2,22,670 ఆదాయం లభించింది.

లక్ష్మీగణపతికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలో గణపతి ఆలయాల్లో సంకటహర చతుర్థి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పాలాభిషేకం నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పాలకొండ రోడ్డులో ఉన్న విజయ గణపతి ఆలయంలో, రైతు బజార్‌లో ఉన్న వినాయకుడి ఆలయంలో పంచముకేశ్వర వినాయక ఆలయంలో, నక్కవీధిలో ఉన్న ఉమా జఠలేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆదిత్యుని సన్నిధిలో సినీగాయని సునీత



గాయని సునీతకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో భద్రాజీ

అరసవల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ప్రముఖ సినీ నేపథ్య గాయని సునీత ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆమెకు స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో భద్రాజీ వారికి అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి కె.మత్స్యలేశం మాజీ సర్పంచ్

గార, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కె.మత్స్యలేశం మాజీ సర్పంచ్ మైలపల్లి లక్ష్మి, జనార్దన్ దంపతులు ఆదివారం బీజేపీలో చేరారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.తేజేశ్వరరావు వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వీరితో పాటు వార్డు సభ్యులు ఎం.లక్ష్మీరాజ్యం, కె.శారద, పుణ్యవతితో పాటు మరో 300 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర పదాధికారి వేణుగోపాల్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ఆమదాలవలస, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డు బొడ్డేపల్లిపేటలో ఉన్న ఆమదాలవలస శాఖా గ్రంథాలయానికి మాజీ కౌన్సిలర్ బొడ్డేపల్లి లక్ష్మణరావు పుస్తకాలు వితరణగా అందించారు. వార్డులో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ పోటీ పరీక్షలు నిమిత్తం ఈ పుస్తకాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. వార్డులో ఉన్న వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్న వ్యక్తులు దాతలు పుస్తక బాంఢాగారాలుగా ప్రసిద్ధిగాంచిన గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని గ్రంథాలయాధికారి కోరారు.


మాజీ సైనికుడికి ఘన నివాళి



కాంతారావు మృతదేహంపై జాతీయజెండా కప్పుతున్న దృశ్యం

ఆమదాలవలస, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): లొద్దలపేట గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పైడి కాంతారావు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ అనంతరం శ్రీకాకుళంలో సెక్యూరిటీ గార్డు విధులు నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి బైరివానిపేటలో నివాసం ఉండేవారు. గత వారం రోజులుగా అనారోగ్యానికి గురైన ఆయన తుదిశ్వాస విడిచారు. బైరవానిపేట గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో జిల్లాకు చెందిన మాజీ స్టేట్‌బ్యాంక్ ఉద్యోగులు పాల్గొని మృతదేహంపై జాతీయ జెండా నుంచి నివాళులర్పించారు.

యువత శ్రమదానం.. అండర్ పాసేజ్ శుభ్రం



ఇంజన్లతో మురుగు తొలగింపు దృశ్యం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎం.తోటూరు గ్రామం ఎల్‌సీ గేటు సమీపంలో గల అండర్ పాసేజ్ చెత్త చెదారం, మురుగుతో నిండిపోయింది. అటుగా వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏ రాజకీయ పార్టీ నాయకులు కూడా పట్టించుకోలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఎం.తోటూరు యువత స్పందించి మోటార్లతో మురుగునీటిని తొలగించి చెరువుకు మళ్లించి చెత్త తొలగించారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

చెత్త తొలగించండి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధి వీకే పేట జంక్షన్ రోడ్డు పక్కనే చెత్త నిల్వ ఉండడంతో దుర్వాసనతో అనారోగ్య పాలవుతున్నామని చెత్తలు తొలగించాలని వీకేపీ కాంప్లెక్స్ మహిళలు కోరుతున్నారు. చెత్త రోడ్డు పక్కనే నిల్వ ఉంచడంతో చెత్తలో పందులు, పశువులు సంచారం చేసి చెత్తలన్నీ రోడ్డుపైకి తీసుకెళ్తున్నాయని దీంతో దుర్వాసన వెదజల్లుతుందని రోడ్డు పక్కన చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సాయిరాం

గుజరాతీపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పాతపెన్షన్ విధానం అమలు చేయాలని డీఎస్సీ-2003 ఫారం రాష్ట్ర కన్వీనర్ మోపిదేవి శివశంకర్ అన్నారు. స్థానిక శాంతినగర్ కాలనీలోని కళింగ భవన్‌లో డీఎస్సీ-2003 ఉత్తరాంధ్ర ఫారం ఆధ్వర్యంలో మెమో 57 ఉద్యోగ, ఉపాధ్యాయ సాధన సమితి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2003లో నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ 2005న నియామకాలు చేపట్టి ఆలస్యం చేసినందుకు పీపీఎస్ విధానంపై నెట్టారని ఆరోపించారు. ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ.. మెమో 57 ప్రాప్తికి పాతపెన్షన్ విధానం వర్తింపజేసి, అన్ని రకాలు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరాం ప్రసాద్ మాట్లాడుతూ.. మెమో 57 ప్రాప్తికి 15 రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం అమలు చేశాయని, ఈ రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. డీఎస్సీ-2003 ఫారం జిల్లా కన్వీనర్ పి.శ్రీహరి మాట్లాడుతూ.. దేశంలో సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యూటీ అమలు చేశారని, నేడు మెమో 57 ప్రాప్తికూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు కె.శ్రీహరి, సుబ్బారెడ్డి, షేక్ మహ్మద్, గాదె శ్రీనివాసులు నాయుడు, కోరెడ్ల విజయగౌరి, కె.భానుమూర్తి, హృదయరాజు, ఎస్.అనిల్‌కుమార్, ఎస్.కిశోర్, జి.గిరిధర్, సీహెచ్ రవీంద్ర, పి.రాజశేఖర్, డి.కేశవ్, బి.నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

కోర్కెల నియంత్రణతో మనసుకు స్వచ్ఛత



సత్సంగంలో మాట్లాడుతున్న వక్తలు

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మానవుడు కోర్కెలను నియంత్రించుకుంటే మనసు స్వచ్ఛత పొందుతుందని మానసిక వైద్యులు డాక్టర్ ఎస్.లక్ష్మణరాజు అన్నారు. ఆదివారం రొట్టవలస శ్రీరామానందాశ్రమంలో ఆశ్రమ గురుస్వామి తొత్తడి వెంకటరమణ ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించారు. యోగా శిక్షకులు జగదీశ్వరరావు మాట్లాడుతూ.. ప్రకృతి అందించే ఆహార పదార్థాలు తిని ఆరోగ్యవంతులుగా జీవించాలన్నారు. సత్సంగానికి హాజరైన భక్తులందరికీ సలంత్రి గ్రామానికి చెందిన చిన్నంనాయుడు, లక్ష్మి దంపతులు భోజనం ఏర్పాట్లు చేశారు. గోపాలస్వామిరెడ్డి, గోవిందరావు, జోగి వెంకటరమణ, డి.రామారావు, దివంజిపేట, కుమ్మరిపేట, జొన్నవలస గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

సర్వశక్తి సమన్వితపై ప్రవచనం



వక్తను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉపనిషన్మందిరంలో ఆదివారం సర్వశక్తి సమన్వితపై డాక్టర్ ఫులఖండం శ్రీనివాసరావు ప్రవచనాలు చెప్పారు. పురాణాల్లో ఉన్న అంశాలు నేటి తరానికి వర్తిస్తాయని మంచి, చెడు, హింస, అహింస సత్ప్రవర్తన దుష్ప్రవర్తన అనే దానిపై మానవ జీవితం ఆధారపడి ఉంటుందన్నారు. ఇలాంటివి ఎన్ని తరాలైనా మార్పు రాలేదని, చెడుపై మంచి విజయం పొందడం అవసరమని, అప్పుడే లోకం సమతుల్యం అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఉపనిషన్మందిరం సభ్యులు ఆయన్ని సత్కరించారు. కార్యక్రమంలో ప్రభాకరరావు, డాక్టర్ మందుల మోహనరావు, విశ్వేశ్వరరావు, రంగుడు ప్రసాదరావు, పెద్ది ఈశ్వరరావు, మల్లేశ్వరరావు, ఉమారాణి, లక్ష్మి సరస్వతి పాల్గొన్నారు.

ద్రవ జీవామృతంతో ప్రయోజనం

ఆమదాలవలస, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చేపేనపేట యూనిట్ పరిధిలోని నిమ్మతొర్లవాడ గ్రామంలో చెరకు పంట కోసం రైతులు సామూహికంగా వెయ్యి లీటర్ల ద్రవజీవామృతం తయారు చేసుకున్నారు. ఈ సందర్భంగా డిజిటల్ ఎల్-2 సురేష్ మాట్లాడుతూ.. యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి, కాంపాక్ట్ బ్లాక్ రైతుల చేత సామూహికంగా ద్రవజీవామృతం తయారు చేయించారన్నారని, దీన్ని వాడడం వల్ల పంటకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

'మార్పు' సేవలు మరువలేనివి



ఐఈఎఫ్ఏ చీఫ్ ప్యాట్రన్ మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

గుజరాతీపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉద్యమ తొలి గురువు కామ్రేడ్ మార్పు బాలకృష్ణమ్మ ఉపాధ్యాయ లోకానికి చేసిన సేవలు మరువలేనివని ఐఈఎఫ్ఏ చీఫ్ ప్యాట్రన్ కె.సుబ్బారెడ్డి అన్నారు. నగరంలోని క్రాంతి భవన్‌లో ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అధ్యయన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలకృష్ణమ్మ ఆశయాలను, ఆచరణలో పెట్టాలన్నారు. అనంతరం తరగతుల్లో ఉపాధ్యాయ ఉద్యమం, సమకాలన అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, న్యూ ఎడ్యూకేషన్ పాలసీ తదితర అంశాలపై శిక్షణ జరిగింది. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి, చింతాడ దిలీప్‌కుమార్, టెంక చలపతి, బి.వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ నాయకులు హాజరయ్యారు.

ఘనంగా తులసమ్మ సంబరం



గజముద్దలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఈదుపురం గ్రామానికి చెందిన 21మంది యువకులు గత కొంత కాలంగా రష్యా దేశంలో ఉపాధిపొందుతున్నారు. వారంతా సంక్రాంతి సందర్భంగా స్వగ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం వారంతా కుటుంబ సభ్యులతో కలిసి లొద్దపుట్టిలో వెలసియున్న ధనరాజ తులసమ్మ అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గజముద్దలు, కాళికామాత, కోయిడాన్స్, మేళ తాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభ



అవార్డులతో క్రీడాకారులు

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో వెన్నెలవలస కళాశాల క్రీడాకారులు ప్రతిభ చూపారు. విజయనగరం జిల్లా గరివిడిలో ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో కళాశాల నుంచి 25 మందితో కూడిన బృందం పాల్గొంది. ఖోఖో, పెయింటింగ్, రన్నింగ్, లాంగ్‌జంప్, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌వీ రమణమూర్తి, వ్యాయామోపాధ్యాయురాలు ప్రసన్న, సహాయకుడు గోవింద్‌పాల్గొనగా.. వీరిని అసిస్టెంట్ ప్రొఫెసర్ మోహన్ వంశీ, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ఢిల్లేశ్వరరావు

హిరమండలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షుడిగా రెల్ల ఢిల్లేశ్వరరావును నియమించారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

'వన్‌ధన్ వికాస్' కేంద్రాలతో గిరిజనులకు ఉపాధి

హరిపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'వన్ ధన్ వికాస్' కేంద్రాల తో గిరిజన మహిళలకు ఉపాధితోపాటు ఆర్థిక భరోసా లభిస్తుందని సీతంపేట ఐటీడీఏ అదనపు సంచాలకుడు డాక్టర్ సన్యాసిరావు అన్నారు. కొండలోగాం, కొంకడాపుట్టి గ్రామాల్లోని వన్‌ధన్ వికాస కేంద్రాల వద్ద జీడిపిక్కల ప్రొసెసింగ్ సెంటర్లను ఆదివారం పరిశీలించారు. అన్ని కేంద్రాలు రన్నింగ్‌లో ఉంచాలని, నిత్యం గిరిజనుల ఉత్పత్తుల ప్రొసెసింగ్ చేస్తూ ఆదాయాన్ని మెరు గుపరచుకోవా లన్నారు. వెలుగు ఏపీఎం కూర్మారావు, సీసీలు ముఖ లింగం, మోహన్, స్వామి నాయుడు, రాజా, జగబంధు, ఆనంద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అరకబద్ర గ్రామానికి చెందిన రంగాల కృష్ణారెడ్డి రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మపురంలో జరిగిన ఓ శుభకార్యక్రమానికి కృష్ణారెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా.. కొఠారి జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి బోల్తాపడ్డాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ చక్రాల కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కృష్ణారెడ్డి (ఫైల్)

కొళిగాం.. ట్రాఫిక్ జాం

- నిత్యమూ వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- టౌన్‌లోకి వచ్చేస్తున్న భారీ వాహనాలు



కొళిగాం రోడ్డులో నిలిచిన వాహనాలు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కొళిగాం రోడ్డులో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో కొళిగాం వద్ద రైల్వే గేటు వేయడంతో సుమారు 20 నిమిషాల పాటు గేటు వద్ద ట్రాఫిక్ సమస్య ఎదురైంది. అక్కడ నుంచి కొళిగాం రోడ్డు మీదుగా ఇచ్ఛాపురం టౌన్‌లోకి వాహనాలు వస్తుండగా లారీ అడ్డంగా ఉండడంతో మరో అరగంట సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటలోపు, రాత్రి 8గంటల తరువాతే ఈ రహదారి గుండా ఇచ్ఛాపురం పట్టణంలోకి లారీలు, ట్రాక్టర్లు వాహనాలు రాకపోకలు సాగించాలని పోలీసులు ఆంక్షలు విధించారు. కానీ, కొందరు వ్యాపారస్తులు పోలీసుల మాటలు పెడచెవిన పెడుతున్నారు. తమ వ్యాపార గోదాముల వద్దకు ఏ సమయంలో పడితే ఆ సమయంలో లారీలు, ట్రాక్టర్లలో సరుకులు తీసుకువచ్చి అన్‌లోడ్ చేయిస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి వ్యాపారస్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారించండి

ఆమదాలవలస, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రతిరోజూ స్తంభించిపోతున్న ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా వన్‌వే జంక్షన్ నుంచి పాలపోలమ్మ గుడి జంక్షన్ వరకు రోడ్లపై ద్విచక్ర వాహనాలు తోపుడు బండ్లు ఇష్టారాజ్యంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. పట్టణంలోని ప్రధాన రహదారిలో ప్రైవేట్ బస్సులు ఎక్కడిబడితే అక్కడే ఆపేస్తుండడంతో మరింత ఇబ్బందిగా మారుతుంది. ఆ సమయంలో వచ్చే అంబులెన్సులు కూడా ఈ ప్రైవేటు బస్సులు వెనుక ఉండిపోయి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. ఇప్పటికైనా పట్టణ పోలీసులు స్పందించి ఈ ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని, ముఖ్యంగా ప్రైవేట్ బస్సు నిలుపుదలపై దృష్టిసారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

మినపచేను తగిలి కారులో మంటలు

టెక్కలి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నౌపడా- మెళియాపుట్టి రోడ్డులో నర్సింగపల్లి సమీపంలో రోడ్డుపై ఆరబెట్టిన మినప చేను కారుకు తగిలి రాపిడితో ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. సీతాపురం గ్రామానికి చెందిన బెండి ఉదయ్ ఆదివారం మధ్యాహ్నం మెళియాపుట్టి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కారులో ఉన్న వ్యక్తులు మంటలను గమనించి కారును పక్కకు ఆపి బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ఈ తరహా సంఘటనలు జిల్లాలో జరుగు తున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధి జర్జంగి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. టెక్కలి నుంచి విశాఖపట్నం వెళుతున్న కారు అదుపుతప్పి డివై డర్ ఎక్కి ఊగిసిలాడుతున్న సమయంలో అదే మార్గంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ వేగాన్ని అదుపు చేసే సమయంలో కారుని స్వల్పంగా ఢీకొంది. అయితే ఈ ఘటనలో కారుకు కొంత నష్టం వాటిల్లినా అందులోని వారికి ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారులో వెళుతున్నవారు టెక్కలిలో ఓ వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

ఆటో బోల్తా పడి ఆరుగురికి గాయాలు

నరసన్నపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దేవాది గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఓ పెట్రోల్ బంకు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. ఎచ్చెర్ల మండలం సనపలవానిపేటకు చెందిన గ్రామస్థులు ఆటోలో నిమ్మాడ వెళుతుండగా దేవాది వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ఆర్.ఈశ్వరమ్మ, కొండాలమ్మ, పైడమ్మలకు బలమైన గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంటనే స్పందించి తగిన సాయం అందించారు.

గృహహింసపై కేసు నమోదు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నౌపడ పంచాయతీ కూర్మనాథపురం గ్రామా నికి చెందిన పరపటి సుమలత ఫిర్యాదు మేరకు గృహహింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు నౌపడ ఎస్ఐ నారాయణస్వామి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇంటిలో తన భర్త విద్యాసాగర్ బెల్టుతో రక్తం వచ్చేటట్టు కొట్టి గాయపరిచారని బాధితురాలు జనవరి 15న ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై ఫోరెన్సిక్ నివేదిక శనివారం అందిందని, ఈ మేరకు విద్యాసాగర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఢిల్లీరావు కుటుంబానికి న్యాయం చేయాలి

పలాసరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పలాస మండలం నీలావతి గ్రామానికి చెందిన తెప్పల ఢిల్లీరావు జనవరి 20న అనుమానాస్పదంగా మృతి చెందినా ఇప్పటి వరకు ఆ కుటుంబానికి పోలీసులు సరైన న్యాయం చేయ లేదని, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఐదు పంచాయతీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు నిర్ణయించారు. నీలావతి గ్రామంలో ఆదివారం ఆయా పంచా యతీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజలతో సమావేశం నిర్వ హించారు. నిందితులను గుర్తించి శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎస్.తిరుపతిరావు అధ్యక్షత వహించగా, గ్రామ పెద్దలు, సర్పంచ్‌లు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

'ప్రయోగశాలగా విద్యా వ్యవస్థ'

టెక్కలి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యావిధానాల రూపకల్పనలో భాగంగా నిత్యం మార్పులు చేస్తుండడం ద్వారా విద్యా వ్యవస్థని ప్రయోగాల కార్యశాలగా మార్చేశారని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డేపల్లి నేతాజీరావు అన్నారు. ఆదివార విలేకరులతో మాట్లాడుతూ.. ఒక స్థిరమైన విధానాన్ని కొన్నేళ్ల పాటు కొనసాగించి వచ్చే ఫలితాలను బేరీజు వేసుకొని అందుకు అనుగుణంగా మార్పులు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జీవో 117 వల్ల విద్యా రంగానికి పెను ప్రమాదం వాటిల్లిందని, దాన్ని ఉప సంహ రించుకోవాలని వంద రోజులు పోరాటం చేస్తే ఇప్పటి ప్రభుత్వం ఆ జీవో రద్దు చేసిందని, అయితే జీవో రద్దు పేరుతో తీసుకువచ్చిన ప్రతిపాదిత నూతన విద్యావిధానం మరింత తిరోగమన దిశలో ఉండి విద్యా వ్యవస్థకు ముప్పుగా పరిణమించిందన్నారు.

గంజాయి రహితం సాధ్యమేనా?

(ఐదో పేజీ తరువాయి)

రైళ్ల ద్వారా వివిధ ప్రాంతాలకు గంజాయి రవాణా చేస్తున్నారు. గతంలో రోడ్డు మార్గాల్లో రవాణా చేసేవారు. అయితే, ఈ మార్గాల్లో పోలీసులు నిఘా పెట్టడంతో గంజాయి ముఠా సభ్యులు రూటు మార్చారు. రైల్వే స్టేషన్లకు చేరుకుని లగేజి బ్యాగుల్లో ఎవరికీ తెలియకుండా గంజాయి తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో అధికంగా వలస కార్మికులే ఉండడంతో పోలీసులకు సైతం అనుమానం రాదు. దీన్నే రవాణా వస్తువులుగా ఎంచుకొని గంజాయి రవాణా చేస్తూ చేతినిండా డబ్బులు సంపాదిస్తున్నారు. సీలేరు, అనకాపల్లి అల్లూరి జిల్లా, పాడేరు మన్యం నుంచి గంజాయి ఎక్కువగా రవాణా జరుగుతుంది. ఆ తరువాత స్థానం శ్రీకాకుళం జిల్లా కావడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో గంజాయి పండించే వారు పూర్తిగా లేక పోయినా, ఒడిశా రాష్ట్రం నుంచి మన జిల్లా మీదుగా రవాణా జరుగు తుండడంతో అధికారులపై సైతం వత్తిడి పెరుగుతోంది.

ఎన్నాళ్లీ ఎదురుచూపు

(ఐదో పేజీ తరువాయి)

స్థలాల కేటాయింపులో జాప్యమవుతోంది. అధికారులు స్పందించి స్థలాలు కేటాయించాలని నిర్వాసితులు కోరుతున్నారు. ఈ విషయమై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వద్ద ప్రస్తావించగా.. వారం రోజుల్లో మూలపేట పోర్టు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ కాలనీ కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నిర్వాసితులకు పీడీఎఫ్‌లు అందజేశామన్నారు.

ఎలీసా కిట్ల కొరత

- నిలిచిన ఆపరేషన్లు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- ఇదీ జిల్లా కేంద్ర ఆసుపత్రి దుస్థితి



టెక్కలి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పేరుకే 200 పడకల జిల్లా కేంద్ర ఆసుపత్రి.. ఈ ఆసుపత్రికి నిత్యం ఏదో ఒక రూపంలో సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. దీంతో వైద్యం కోసం వచ్చేవారు అవస్థలు పడుతున్నారు. కొన్నాళ్లు వైద్యులు, వైద్య సిబ్బంది కొరత.. ఇంకొన్నాళ్లు మందులు.. తాజా గా మేజర్, మైనర్ ఆపరేషన్లకు సంబంధించి హెచ్ ఐవీ టెస్ట్‌ల నిర్వహణకు ఎలీసా కిట్లు కొరత ఏర్పడింది. ఎలీసా కిట్‌తో మొదట స్క్రీనింగ్ టెస్ట్ చేసిన తరువాతనే వైద్యులు ఆపరేషన్లు చేస్తారు. దీని ఖరీదు రూ.300లోపే అయినా ఈ కిట్ల కొరత కారణంగా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పలురకాల ఆపరేషన్లు నిలిచిపోయాయి. ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ ఇలా ఏ విభాగంలో ఆపరేషన్ చేయాలన్నా ముందుగా ఎలీసా కిట్‌తో స్క్రీనింగ్ టెస్ట్ చేసిన తరువాతనే ఆపరేషన్లు చేస్తారు. ఒకవేళ ఈ టెస్ట్‌లో ఆపరేషన్ చేసుకున్న వ్యక్తికి పాజిటివ్ అని తేలితే ట్రైడాట్, కూంబ్ ఎయిడ్ తదితర పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యారావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తా వించగా ఎలీసా కిట్ల కొరత విషయం తన దృష్టికి రాలేదని, సోమవారం నాటికి సమకూరుస్తామన్నారు.

మధుర నుంచి వచ్చిన ఇస్కాన్ భక్తులు

టెక్కలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగు బ్రాహ్మణ వీధిలో 1720వ సంవత్సరంలో కృష్ణచంద్ర గజపతి నిర్మించిన రాధాకాంత మఠం ఆలయ పునర్నిర్మాణ పనుల పర్యవేక్షణకు మధుర నుంచి పలువురు ఇస్కాన్ భక్తులు ఆదివారం టెక్కలి చేరుకున్నారు. భారీ కొమ్ములు కలిగిన నాలుగు ఎడ్లు, స్వామివారి విగ్రహంతో ఆలయానికి వారు రావడంతో పెద్ద ఎత్తున భక్తులు వారిని తిలకించారు. ఈ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు.



టెక్కలి వచ్చిన ఇస్కాన్ భక్తులు

దివ్యాంగులకు రాయితీపై ఇంధనం

- 50 శాతం సబ్సిడీపై పెట్రోల్, డీజిల్

హిరమండలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): బండి రోడ్డుపైకి తీయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి.. పెట్రోల్, డీజిల్ ధరలతో వాహనాలను నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వైకల్యం కలిగి స్వయం ఉపాధి పొందుతున్న వారికి, ప్రైవేటు ఉద్యోగులకు 50 శాతం రాయితీపై పెట్రోల్, డీజిల్ అందించేందుకు నిర్ణయించింది. వాస్తవానికి గత టీడీపీ హయాంలోనే 2014-19 మధ్య మూడు చక్రాల మోటారు వాహనాలు వినియోగించే దివ్యాంగులకు ఇంధనాన్ని రాయితీపై ఇచ్చారు. అయితే 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నిధులను కూడా పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదన్న విమర్శలు వినిపించాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తర్వాత దివ్యాంగులకు అంద జేసే పించన్ నగదు ను రూ.6 వేలకు పెంచడంతో పాటు వైసీపీ పాలనలో నిలిచిన సంక్షేమ పథకా లను పునరుద్ధరించే దిశగా అడు గులు వేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా దివ్యాంగులకు సంబంధించిన వాహనాలకు రాయితీపై ఇంధనం అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఈపథకం వర్తించే ప్రతి లబ్ధి దారుడికి రూ.2 వేలు వరకు లబ్ధి చేకూర నుంది. జిల్లాలో 7 వేల మంది పింఛన్ పొందుతున్న దివ్యాంగులున్నారు. వీరిలో సుమారు నాలుగు వంద మంది వరకు స్వయం ఉపాధి, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి ఇంటి నుంచి పని ప్రదేశానికి వెళ్లే వరకు ఇంధనం రాయితీ వర్తిస్తుంది. 2 హెచ్‌పీ ఇంధన సామర్థ్యం కలిగిన వాహనాలకు గరిష్ఠంగా 15 లీటర్లు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన వాటికి 25 లీటర్ల వరకు రాయితీ ఇవ్వనున్నారు. కొనుగోలు చేసిన బిల్లులను మూడు నెలలకు ఒకసారి సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంది. దీంతో దివ్యాంగులకు ఇంధన భారం కొంత మేర తగ్గనుండడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది.



మూడు చక్రాల బైక్‌ని నడుపుతున్న దివ్యాంగుడు

వైభవంగా ఎమ్మెల్యే ఎంజీఆర్ తనయుడి వివాహం

- తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, అభిమానులు

పాతపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కుమారుడు జయప్రకాశ్ వివాహం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. అతిరథుల రాకతో పాతపట్నంలోని ఆయన స్వగృహంలో పండగ వాతావరణం నెలకొంది. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబ సమేతంగా విచ్చేసి వధూ వరులు జయప్రకాశ్, దుర్గ వైష్ణవి భార్గవి దంపతులను ఆశీర్వదించారు. అలాగే విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్టీ ఉత్తరాంధ్ర జోనల్ కోఆర్డినేటర్ పొనుగంటి శ్రీనివాసరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తి, శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం జిల్లాల ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, గొండు శంకర్, ఎన్ఈఆర్, బోనెల విజయచంద్ర, నిమ్మక జయ కృష్ణ, అదితి గజపతిరాజు, కోండ్రు మురళీమోహన్, పాలకొండ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపా రాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు తదితరులు విచ్చేసి నూతన వధూవరులను అభినందించి ఆశీర్వదించారు. అతిథులను ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గాయని సునీత సినీ గీతాలాపన ఆహూతులను అలరించింది. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



నూతన వధూవరులను అభినందిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



గీతాలాపన చేస్తున్న ప్రముఖ గాయని సునీత

ముగిసిన సుసరాం దుర్గమ్మ జాతర



ఎమ్మెల్యే రమణమూర్తిని సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

పోలాకి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సుసరాం గ్రామంలోని దుర్గమ్మ జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. గత రెండు రోజులుగా అర్చకుల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయంలో భక్తులు మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ఎస్ఐ రంజిత్ పర్యవేక్షించారు. దేవాలయ ఈవో విశ్వేశ్వరరావు, ఆలయ శాశ్వత ధర్మకర్త సనపల అప్పలసూరి, సర్పంచ్ దుంపల ఆనందరావు, మాజీ సర్పంచ్ తమ్మినాన భూషణరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దుంపల భాస్కరరావు తదితరులు జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. సోమవారం దుర్గమ్మ ఆలయ హుండీ లెక్కింపు ఉంటుందని తెలిపారు. సుసరాం దుర్గమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్థులకు సాయం

పలాసరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల సహాయార్థం ఇటీవల ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యుఫోరియా కార్యక్రమానికి జనసేన పార్టీ తరఫున రూ.లక్ష అందజేసినట్లు ఆ పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తం చెక్కును ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి అందజేసినట్లు తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 16(ఆంధజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆది వారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఈ వినతులపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన ప్రజలకు మేలు చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా ఇళ్లు, పింఛన్ల మంజూరు, ఉపాధి అవకాశాలు, రోడ్లు మంజూరు చేయాలని ప్రజలు కోరారు.



ఎర్రన్న ఘాట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

ఎర్రన్న ఘాట్‌ను సందర్శించిన మంత్రులు

నిమ్మాడలోని దివంగత నేత మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఘాట్‌ను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఆదివారం సందర్శించారు. ఈనెల 23న ఎర్రన్నాయుడు జయంతి వేడుకల నిర్వహణపై ఆయన సోద రులు కింజరాపు ప్రభాకర్, హరివరప్రసాద్‌లతో చర్చించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి

నరసన్నపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన దిశగా కృషి చేస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ శిష్టకరణ సంఘం అధ్య క్షుడు, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. భీమారావు అన్నారు. స్థానిక శిష్టకరణ సంఘం భవ నంలో సమావేశం జరిగింది. అనంతరం భీమారావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా శిష్టకరణ సంఘం ప్రధాన కార్యదర్శి సదాశివుని కృష్ణ, అధ్యక్షుడు ఎంవీజే మోహనరావు, ప్రభాకర రావు, బుజ్జి, వసంత కుమార్, విజయ లక్ష్మి, ప్రసాద్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



భీమారావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

గంజాయిపై ప్రత్యేక నిఘా

హరిపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో హైవే, రైల్వే స్టేషన్ వద్ద మాదక ద్రవ్యాలైన గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. హరిపురం, కొర్రాయిగేటు, మఖరజోల గ్రామాలను ఆదివారం సందర్శించి స్థానికులతో మాట్లాడుతూ.. అపరిచిత, కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. గంజాయి వినియోగించినా, రవాణా చేసినా, పండించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

నందిగాం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మణిగాం గ్రామంలోని అభయాంజనేయ స్వామి మందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఆదివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామపురోహితుడు రేజేటి బోసుబాబు ఇతర రుత్వికుల పర్యవేక్షణలో మహిళలతో కుంకుమార్చనలు చేపట్టారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠతో పాటు అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కి..

- ఆందోళన చేసిన గ్రామస్థులు

హిరమండలం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలంలో తాగునీటి కోసం మహిళలు ఆదివారం రోడ్డెక్కారు. గత నాలుగు రోజులుగా రక్షిత నీటి పథకం కొళాయిల నుంచి నీరు రాకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చిన్న కోరాడ వీధికి చెందిన పలువురు ఆదివారం అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఈ వీధిలో సుమారు నెల రోజుల నుంచి కొళాయిల ద్వారా పూర్తిస్థాయిలో నీరందడం లేదని, వంశధార నది నుంచి తీసుకు రావాల్సి వస్తోందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

మహావిష్ణుకి కిరణ స్పర్శ



జలుమూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వరాలయ క్షేత్రపాలకుడు విష్ణుమూర్తి పాదాలకు ఆదివారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. దీనిని భక్తులు తనివి తీరా దర్శించుకున్నారు. ప్రతీ మాఘ మాసం రెండోవారంలో పదిరోజుల పాటు విష్ణుమూర్తిని సూర్యకిరణాలు తాకుతున్నట్లు అర్చకులు నారాయణమూర్తి తెలిపారు.

కొండ కరుగుతోంది..

- రాత్రి వేళల్లో అక్రమ తవ్వకాలు
- కంకరను తరలించుకుపోతున్న వైనం

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినవంక పంచాయతీ పరిధిలో ఉన్న తాడివాడ కొండ కరిగిపోతుంది. అక్రమార్కులు రాత్రివేళల్లో కొండను తవ్వి కంకరను తరలించుకుపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టడంతో చాలా వరకు కొండ తరిగిపోయింది. కంకరను తవ్వి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మకాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తవ్వకాలు నిలిచిపోయాయి. మళ్లీ గత కొన్నిరోజులుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి 12 గంటల తరువాత యంత్రాలతో వచ్చి కొండ వద్ద తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.



తవ్వకాలు చేపట్టడంతో తరిగిపోయిన తాడివాడ కొండ

పనిచేయని ఫైబర్ నెట్

(ఐదో పేజీ తరువాయి)

రూ.10వేలు, స్విచ్ విలువ రూ.40వేల నుంచి రూ.50వేల వరకూ ఉంటుంది. ఒక్కో పరికరానికి సుమారు రూ.50వేల నుంచి రూ.60 వేలు వెచ్చించారు. జిల్లాలో మొత్తం 835 గ్రామ సచివాలయాలు ఉండగా.. ఈ పరికరాల కోసం రూ.5కోట్లకుపైగా ఖర్చు చేశారు. ఇక కనెక్షన్ ఇచ్చేందుకు గ్రామాల మధ్య హోమ్ ఫైబర్ ఏర్పాటు చేశారు. సాధారణ వైరు మీటరు రూ.10 నుంచి 15 వరకు ఉంది. కానీ ఆధునాతన ఈ వైరు మీటరు రూ.60 వరకు ఉంటుందని అంచనా. ఇలా ఈ వైర్ల కోసం మరికొన్ని నిధులు ఖర్చు పెట్టారు. కాగా ఈ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఫైబర్‌నెట్ పరికరానికి ఇంటర్ నెట్ అందించేందుకు గ్రామాల మీదుగా వేసిన వైర్లు ఎక్కడపడితే అక్కడ తెగిపడుతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. ఉదాహరణకు హిరమండలంలోని గొట్టాబ్యారేజీ దిగువన గులుమూరు గ్రామంలో ఫైబర్ నెట్ వైర్లు తెగిపోయి రోడ్డుకు అడ్డంగా పడి ఉన్నాయి. గత నాలుగు నెలలుగా రహదారిపైనే పడి ఉన్నా ఎవరూ పట్టించు కోవడం లేదు. ఈ వైర్లు వాహనాలకు చిక్కుకొని ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పనులు సకాలంలో పూర్తికాక.. నిధులు వృథా అయ్యాయని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వైర్లు సరి చేయాలని, ఫైబర్ నెట్ సేవలు మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లారీ కాదండోయ్.. ఆటోనే

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో చూస్తున్నారుగా.. ఇదేదో పెద్ద లారీపై సరుకులను తీసుకువెళుతున్నారని భ్రమ పడితే అది తప్పే.. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన మార్గంలో నిత్యం ఇలాంటివి అనేకం కనిపిస్తున్నాయి. ఇది కేవలం ఆటో పైభాగాన్ని తొలగించి ఇలా ప్రమాదకరంగా సామగ్రి మూట లను తరలిస్తున్నారు. ఏ గోతిలోనో పడితే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశాలున్నాయి. ఏ మాత్రం ఆ మూటలు పడిపోయినా వెనుక నుంచి కాని, పక్క నుంచి వెళ్లేవారు గాయాల బారిన పడాల్సిందే. వీటిని నియంత్రించాల్సిన పోలీసు అధికారులు స్పందించకపోవడంతో నిత్యం ఇలా వాహనాలపై ప్రమాదకరంగా సరుకులను తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇలాంటి వాటిని నిరోధించాలని పలువురు కోరుతున్నారు.



ఎల్ఎన్‌పేట సమీపంలో లోడుతో వెళుతున్న ఆటో